
# నవభూమి

## జిల్లా అనుబంధం

10 ఫిబ్రవరి,2025 సోమవారం పేజీలు:5

www.epaper.navabhoomi.in




# స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రి తుమ్మల

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
- స్థానిక సంస్థల ఎన్నికలను ఛాలెంజ్ గా తీసుకోవాలి కష్టపడే కార్యకర్తలకు ఎన్నికల్లో ప్రాధాన్యం





**ఖమ్మంనగరం, నవభూమి, ఫిబ్రవరి 9:** స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, స్థానిక సంస్థల ఎన్నికలను ఛాలెంజ్ గా తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఖమ్మంనగరంలోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఖమ్మం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టపడే కార్యకర్తలకు ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలకు గౌరవం కల్పించే అవకాశం స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిందని, ప్రజామోదం ఉన్న నేతలను ఎన్నికల్లో ఎన్నుకోవాలని అన్నారు. తల్లి లాంటి పార్టీ కోసం ఎలాంటి ద్రోహం లేకుండా నాయకులు పని చేయాలని, సొంత పార్టీలో ఉండి క్రమశిక్షణ తప్పిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామ పంచాయితీల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారం లేక పోయినా సీఎం రేవంత్ గుండె ధైర్యంతో పాలన చేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలన్నారు. అరాచకం లేని ఖమ్మం, ప్రగతిశీల ఖమ్మం, కాంగ్రెస్ పాలనలో సాధ్యమయిందని అన్నారు. మున్నేరు వరద గండం లేకుండా శాశ్వత పరిష్కారంగా యుద్ధ ప్రాతిపదికన రిటైనింగ్ వాల్ నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ నిర్ణయం మేరకు కమిటీలు పని చేయాలని అన్నారు.

# టేకులపల్లి సబ్ పోస్ట్ ఆఫీస్‌లో చోరీ

**టేకులపల్లి ఫిబ్రవరి 9 నవభూమి ప్రతినిధి :** మండల కేంద్రం టేకులపల్లిలోని సబ్ పోస్ట్ ఆఫీస్ లో గుర్తుతెలియని వ్యక్తులు కొందరు చోరీకి తీవ్రయత్నం చేశారు. ఈ మేరకు పోస్టుమాస్టర్ ప్రసాదరెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ప్రసాద్ రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పోస్ట్ ఆఫీస్ తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. అయితే నగదు దొరకకపోయేసరికి కంప్యూటర్ కి సంబంధించిన మానిటర్, బార్కోడ్ స్కానర్ను ధ్వంసం చేసినట్టు ఆయన తెలిపారు. కాగా నగదు కానీ ఎలాంటి పత్రాలు కానీ చోరీకి గురి కాలేదని ప్రసాద్ రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎస్సై పోగుల సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు





# వైభవంగా అక్షరాలతోవ వార్షికోత్సవం

- కథల, కవితల విజేతలకు పురస్కారాల ప్రదానం
- విజేతల రచనల సంపుటి ఆవిష్కరణ

**ఖమ్మం, నవభూమి ఫిబ్రవరి 9:** ప్రముఖ సాహితీ సంస్థ అక్షరాలతోవ సాహితీ సంస్థ ఏడవ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఖమ్మంలోని జెడ్పీ మీటింగ్‌హాల్‌లో అక్షరాలతోవ నిర్వాహకులు నామా పురుషోత్తం అధ్యక్షతన జరిగిన సభలో అంతర్జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన కథల, కవితలతో ప్రచురించిన పుస్తకాన్ని రిటైర్డ్ హెచ్ఎం, పరిశ సీతారత్నం ట్రస్ట్ వ్యవస్థాపకులు పరిశ పుల్లయ్య, స్పర్శ సామాజిక అధ్యయన కేంద్రం ఛైర్మన్ స్పర్శ భాస్కర్ ఆవిష్కరించారు. అనంతరం సభలో పరిశ పుల్లయ్య, భాస్కర్ మాట్లాడుతూ సమాజంలో మార్పులను గమనిస్తూ పీడితుల పక్షాన నిలిచే కవిత్వాన్ని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ పరిశీలనను పెంపొందించే రచనలు రావాలన్నారు. సామాన్యుల పక్షాన కవిత్వ నిలవాలన్నారు. సమాజహితాన్ని కోరుతూ సాహిత్య సేవ చేస్తున్న అక్షరాల తోవ సాహిత్య సంస్థను అభినందించారు. జెవివి రాష్ట్ర నాయకులు అలవాల నాగేశ్వరరావు మాట్లాడుతూ సైన్స్‌ను బలపరుస్తూ కవిత్వం రావాలన్నారు. ప్రశ్నించే తత్వాన్ని బలపరచాలన్నారు. ప్రముఖ కవి, విమర్శకులు సైదులు ఐనాల మాట్లాడుతూ నేర్చుకోవడం, నేర్పడం కవులు చేయాలన్నారు. కవులను ప్రోత్సహిస్తూ ఏడేళ్లుగా అక్షరాల తోవ చేస్తున్న కృషిని కొనియాడారు. ప్రముఖ రచయిత్రి వురిమళ్ల సునంద, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు తాళ్లూరి లక్ష్మీ, ప్రముఖ రచయిత, గాయకుడు యోచన మాట్లాడుతూ అక్షరాలతోవ సాహిత్య సేవను విశ్లేషిస్తూ అభినందించారు. ప్రముఖ సినీ దర్శకులు కొత్తపల్లి శేషు తన ప్రసంగంతో సభను అలరించారు. తెలుగు భాషా గొప్పతనం, అక్షరాల తోవ సాహిత్య సేవను కొనియాడుతూ వినిపించిన కవిత అందరినీ ఆకట్టుకుంది. విజేతల కథల, కవితలతో రూపొందిన పుస్తకాన్ని రాచమల్ల ఉపేందర్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా అక్షరాల తోవ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త అన్నం శ్రీనివాసరావును సన్మానించారు.రెండు తెలుగు రాష్ట్రాల లోనుండి వచ్చిన కథ కవిత విజేతలు స్పందన సభికులను ఆకట్టుకుంది.. అనంతరం కథల, కవితల విజేతలకు పురస్కారం అందచేశారు. ప్రముఖ గాయకులు పాగి వెంకన్న, సత్యానందం, రేళ్ల శ్రీనివాస్, పొట్టేటి వెంకట్రామయ్య, సీతా్లనాయక్ గీతాలు అందిరనీ అలరించాయి. ఈ కార్యక్రమంలో అక్షరాలతోవ నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్, ప్రముఖ కవులు సయ్యద్ షఫీ, కన్నెగంటి వెంకటయ్య, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కంచర్ల శ్రీనివాస్, ఇబ్రహీం నిర్గుణ్, పెద్దోజు నరేష్ తదితరులు పాల్గొన్నారు

# చిరుతపులి సంచారం



**ఖమ్మం-నవభూమిబ్యూరో:** పెనుబల్లి మండలం, బ్రహ్మళకుంట గ్రామ పరిధిలో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. చిరుత పాద ముద్రలు కనిపించడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి గుండాల ప్రాజెక్టు సమీపంలో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు మైక్ ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పులి గుండాల సమీపంలో వ్యవసాయ పనుల కోసం వేళ్ళే వారు గుంపులు గుంపులుగా మాత్రమే వెళ్ళాలని సూచించారు. రాత్రిపూట బయటకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు అటవీ శాఖ అధికారులు హెచ్చరిక చేశారు. చిరుతపులి కలిపిస్తే సమాచారం అందించాలని, వన్యప్రాణులకు హాని కలిగించవద్దని అధికారులు పేర్కొన్నారు.

కాగా నాలుగు రోజుల క్రితం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, తిర్యాణి మండలం, చింతపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. చిరుత సంచారాన్ని స్థానిక గ్రామస్తులు గుర్తించారు. పొలం పనులు ముగించుకుని అటవీ ప్రాంతంలో వెళ్లిన సమయంలో చెట్టు కొమ్మపై చిరుతపులి ఉండటాన్ని గమనించి ఫోన్లో వీడియో తీశారు. తర్వాత అటవీశాఖ అధికారులు సమాచారం అందించారు. అధికారులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పరిశీలించారు. పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామస్తులు ఎవరూ అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని హెచ్చరించారు. చిరుతపులి జాడ కనిపిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

# ప్రశాంతంగా డిబిపిహెచ్‌పిఎస్ పరీక్షలు





**అశ్వారావుపేట రూరల్ ఫిబ్రవరి 9 నవభూమి:** దక్షిణ భారత హిందీ ప్రచార సభ, హైదరాబాద్ వారి ఆధ్వర్యం లో నిర్వహించిన హిందీ భాషా సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ప్రశాంతంగా జరిగినాయి. అశ్వారావుపేట లోని స్థానిక ఏ - వన్ కిడ్స్ స్కూల్ లో జరిగిన పరీక్షా కేంద్రంలో హిందీ ప్రాథమిక, హిందీ మాధ్యమిక, హిందీ రాష్ట్రీయ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుండి మొత్తం నలభై మంది విద్యార్థులు హాజరు అయ్యారు. ఈ పరీక్షలు ఉదయం 9:00 గంటల నుండి, సాయంత్రం 4:30 వరకు జరిగినాయి. ప్రాథమిక కోర్సు పరీక్షలు మాత్రం కేవలం ఉదయం ఒక పూట, మాధ్యమిక, రాష్ట్రీయ కోర్సు పరీక్షలు ఉదయం, సాయంత్రం జరిగినవి. ఇక్కడ ఈ పాఠశాలలో యు కె జి నుండే హిందీ వర్ణమాల నేర్పుతున్నాం అని, అందువల్ల విద్యార్థులకు హిందీ భాషా సులభంగా చదవడం, రాయడం బాగా అలవాటు ఐనది అని, అందుకే ఈ పరీక్షలు గత ఆరు సంవత్సరాలుగా, ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి నెల లో నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయులు రాధ అన్నారు. కనుక ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు

# 14న సెలవు దినంగా ప్రకటించాలి



**గార్ల, నవభూమి, ఫిబ్రవరి 8:** బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజైన ఫిబ్రవరి 14వ తేదీన అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని బంజారా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ కుమార్ జాదవ్ రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంత్రికి అందించిన వినతి పత్రం ప్రతులను శనివారం గార్లలో విలేకరులకు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షలకు పైగా జనాభా ఉన్న బంజారాలు సేవా లాల్ జయంతి సంతోషకరమైన సమయంలో జరుపుకోవాలని ప్రభుత్వం దీనిని గుర్తించి సెలవు దినం గా ప్రకటించాలని కోరారు. జయంతి రోజు అవసరమైన నిధులను విడుదల చేసి ప్రభుత్వపరంగా కార్యక్రమాన్ని నిర్వహించే చర్యలు చేపట్టాలని రాజ్ కుమార్ విద్యార్థి చేశారు.

# చాప కింద నీరుల దశాబ్ద కాలంగా కొనసాగుతున్న పూర్ణచంద్రరావు సేవా కార్యక్రమాలు

**జన్నారం, నవభూమి:-** ఏదన్న కార్యం తలపెట్టాలంటే పట్టుదల, నిరంతరకృషి, దృఢ సంకల్పం అనేవి ప్రధానం ప్రజాసేవకే ఆయన జీవితం ద్వారా పోశారు అంటున్నారు ప్రజలు. దశబ్ద కాలంగా చాప కింద నీరుల ఎన్నో వేలాది కుటుంబాలకు నిరంతరాయంగా సహాయ సహకారాలు అందిస్తూనేజ నియోజకవర్గ ప్రజలకు ఒక దేవునిగా నిలుస్తున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త మాదాడి పూర్ణచందర్రావు. ఇప్పటివరకు వేలాది కుటుంబాలకు సహాయ సహకారాలు అందించారు ఎన్నో కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.ఆయన ప్రత్యక్షంగా సహాయ సహకారాలు అందించకపోయిన ప్రతి కార్యక్రమానికి ఆయన చేసిన సహకారాలు ఎన్నో ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. ప్రతి మారుమూల గ్రామానికి చెందినవారికి అత్యవసర సమయంలో నిత్యవసర సరుకులు వివిధ అనారోగ్యాలకు గురైన వారికి ఆర్థిక సహాయ సహకారాలు కరోనా వైరస్ సమయంలో ఆయన అందించిన సహాయ సహకా రాలు మరువలేనివి. నూతన ఆలయాల నిర్మాణాలు అధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో దైవభక్తి మెండుగా ఉన్న ఆయన ప్రతి ఆలయంలో భోజన వసతి పూజా కార్యక్రమాలు సొంత ఖర్చుతో చేయించి ప్రజలతో భాగస్వాములు అవుతున్నారు. పలు గ్రామాలకు మౌలిక వసతులు కల్పనకు ఎంతో శ్రద్ధ తీసుకొని ప్రజల బాగోగులు తీరుస్తున్నారు. వ్యాపారస్తునిగా ఎంతో బిజీగా ఉన్నప్పటికీ ప్రజలని కలుస్తూ వారిని మనస్ఫూర్తిగా పలకరిస్తుంటారు.

# పెద్దమ్మ గుడిలో శివాలయ ప్రతిష్ఠ

## ■ మహా కుంభాభిషేక మహోత్సవాలు

**పాల్వంచ టౌన్ ఫిబ్రవరి 9 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశ్వాపురం - జగన్నాథపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి) లో ఆదివారం ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ శివాలయంలో శ్రీ స్వామివారి పరివార దేవత సహిత జీవధ్వజ పంచాహ్నిక దీక్ష ప్రతిష్టాపన అమ్మవారి పంచమ పుష్కర పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవ ములు ఈనెల 6న ప్రారంభించామని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి తెలిపారు. నాలుగో రోజు ప్రతిష్ట మహోత్సవము లో గణపతి పూజ, కర్మణ పుణ్య హవచనము పంచ అమృత పంచగవ్య అది వానము మూలమంత్ర హోమము నిర్వహించారు. మహిళ భక్తులచే సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. మధ్యాహ్నం చండీ హోమం సాయంత్రం సంబర హోమం, అంగ హోమము లు ధాన్యాధివా న ము పుష్పాదివానము, హిరణ్య దివానము శ యాదివానము, నివేదన స్వస్తి తీర్థ ప్రసాద వినియోగం జరిపించారు. ఈ పూజా కార్యక్రమంలో బ్రహ్మశ్రీ అవధానుల శివ సంతోష కుమార్ శర్మ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. అదేవిధంగా నేడు(10) పదో తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషాలకు గణపతి పూజ పుణ్యాహవచనము అది వానము హోమము ధాతున్యాసము 9 గంటలకు నూతక్కి శ్రీనివాసరావు రాజకుమారి దంపతులచే నిర్మించబడిన కళ్యాణ మండపం అన్నదాన సత్రముల ప్రారంభం11 గంటల 30 నిమిషాలకు స్థిర మంత్ర విగ్రహ శిఖర ప్రతిష్ట కళన్యాసం, కళా ప్రతిష్ట,ప్రాణ ప్రతిష్ట దృష్టి కుంభం, మధ్యాహ్నం 12 గంటల15 నిమిషాలకు అమ్మవారి ఆలయంలో పంచ పుష్కర మహా కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారని దేవస్థాన కార్యనిర్వహణాధి కారి ఎన్. రజనీకుమారి తెలిపారు









# రాష్ట్రస్థాయి మాస్టర్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్స్ ప్రారంభం

## ■ ప్రారంభించిన టిఆర్వికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్

**పాల్వంచ ఫిబ్రవరి 9 నవభూమి ప్రతినిధి:** కీర్తి శేషులు గుజ్జుల సుధాకర్ రెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మాస్టర్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ను కొత్తగూడెం లోని ఇండోర్ స్టేడియం లో కొత్తగూడెం డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీ లను ఆదివారం టిఆర్వికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్వర్గీయ గుజ్జుల సుధాకర్ రెడ్డి సంస్మరణార్థం వారి శ్రీమతి సావిత్రి పోటీలు నిర్వహించటం గర్వనీ యమన్నారు. ఈ పోటీలు దిగ్విజయం కావాలని కోరారు. అంతర్జాతీయ స్థాయిలో షటిల్ టోర్నమెంట్ పోటీలలో పాల్గొని పోటీ పడుతున్న క్రీడాకారులకు అయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. జిల్లాలో మహోన్నత మైన క్రీడాకారులు అభివృద్ధి చెందాలని అభిలాషించారు. అనంతరం జిల్లా బ్యాడ్మింటన్ కార్యదర్శి డాక్టర్ సావిత్రి, రమేష్ ను ఘనంగా సన్మానించి, మెమొంటో అందచేశారు. ఈ బాల్ బ్యాడ్మెంటేన్ టోర్నమెంట్ కార్యక్రమానికి ఆర్గనేజింగ్ కార్యదర్శి టిఆర్వికెఎస్ కేటీపీఎస్ 7 వ దశ వర్కింగ్ ప్రెసిడెంట్ నారందాసు వెంకటేశ్వర్లు ప్రముఖ పాత్ర నిర్వహింస్తున్నారని, ఈ క్రీడా పోటీలలో సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్వికెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాసూరి శ్రీనివాస్, రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ ముత్యాల రాంబాబు, జెన్కో ఉపాధ్యక్షులు ధర్మపురి నాగేశ్వరరావు, వైటిపిఎస్ రీజినల్ కార్యదర్శి నాదేళ్ల రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.








## అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**సీఐ సతీష్**

**దొంగతనాల నివారణపై ప్రత్యేక దృష్టి**

**కాంట్రాక్టర్స్ కాలనీలో అవగాహన**





**పాల్వంచ ఫిబ్రవరి 9 నవభూమి ప్రతినిధి:** కొద్ది రోజులుగా పాల్వంచలో దొంగల సంచారం తీవ్రతరమైంది. పలు కాలనీలలో దొంగలు స్పైర విహారం చేసి, విలువైన వస్తువులు, డబ్బు దోచుకెళ్తున్నారు. పట్టణం లోని కాంటాక్ట్స్ కాలనీలో అర్ధరాత్రి దొంగల సంచరిస్తూ భయ బ్రాంతులకు గురి చేస్తున్నారు. ఆరు ఇండ్లలో దొంగతనాలకు ప్రయత్నం చేశారు. ఒక ఇంట్లో తాళాలు పగల గొట్టే ప్రయత్నం చేయగా, ప్రజల అలజడి విని దొంగలు పారిపోయారు. దొంగలు కారులో వచ్చి దొంగ తనాలకు పాల్పడుతున్నట్లు సిసి కెమెరాలలో దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక సి ఐ సతీష్ కాంట్రాక్టు కాలనీకి వెళ్ళి కాలనీ వాసులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్సై రాఘవయ్య. అప్రమత్తంగా ఉండాలని కాలనీవాసులకు సూచనలు చేశారు. పోలీస్ పెట్రోలింగ్ పెంచుతామన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు ఎస్సై రాఘవయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.


## పేదవారికి అండగా ఉంటూ బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం, బియ్యం అందిస్తున్న పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి ఫిబ్రవరి 9 (నవభూమి):** రాయపర్తి మండలం తిర్మలాయపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాతృచ నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగాఈ రోజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, 50 కేజీ ల బియ్యం, ఆయిల్ క్యాన్ ను. ఎస్ ఆర్ ఆర్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమం లో రాయపర్తి మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, పూస మధు గ్రామ తాజా మాజీ సర్పంచ్ గజవెల్లి ప్రసాద్, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, లేతకుల మధుకర్ రెడ్డి, కోలా సంపత్,గజవెల్లి రాజు, బక్క ఎల్లయ్య, చొప్పర గట్టుమల్లు, ఎల్లస్వామి, రవి నాయక్, మహేష్, దోమల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు

# బౌద్ధ మార్గంలో సబ్బతి మంగాయమ్మ స్మృతి శేష కార్యక్రమం

- బుద్ధం శరణం గచ్ఛామి,సంఘం శరణం గచ్ఛామి అన్న బుద్ధుడు
- జై బీమ్ నినాదాలతో అంబేద్కర్‌ను కీర్తిస్తూ
- ఏసిపి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో పుణ్యానుమోదన సమారంభం
- మండల కేంద్రంలో మొట్ట మొదటగా బౌద్ధ ఆచార కార్య క్రమం ప్రారంభం







**జూలురుపాడు,ఫిబ్రవరి 09 (నవభూమి ప్రతినిధి)–** మండల కేంద్రానికి చెందిన పోలీస్ ఉన్నతాధికారి సబ్బతి విష్ణుమూర్తి తన తల్లి మంగాయమ్మ ఇటీవల పరమ పదించారు. సాధారణంగా దశ దిన కార్య క్రమమని, జ్ఞాపకార్థ కూడిక అని 40 రోజుల కార్య క్రమమని హిందూ,క్రైస్తవ,ముస్లిం మతాచార ప్రకారం జరిగే కార్య క్రమాలు మనకు తెలుసు.విష్ణు మూర్తి కుటుంబం బౌద్ధ మతాన్ని స్వీకరించారు.ఆ మతాచార ప్రకారం ఆదివారం వినూత్న రీతిలో తన తల్లి స్మృతి శేష కార్య క్రమం నిర్వహించారు.ఈ కార్య క్రమాన్ని బౌద్ధ భిక్షువు నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి పై బౌద్ధ జెండాలతో అలంకరించారు. మొట్ట మొదట సారిగా బౌద్ధ ఆచారం ప్రకారం నిర్వహిస్తున్న కార్య క్రమాన్ని ఆహుతులు ఆసక్తి గా తిలకించి బౌద్ధబిక్షువు ప్రసంగాన్ని శ్రద్ధతో ఆలకించారు.ఆహుతులైన ప్రముఖులకు విష్ణుమూర్తి బౌద్ధనికి గుర్తుగా వున్న పంచ రంగుల కండువాలు కప్పి ఆహ్వానించి బౌద్ధాన్ని పరిచయం చేశారు.

ఈ సందర్భంగా బౌద్ధ మతం,బుద్ధ భగవానుని బోధనలు,ఆచారాలు, సంప్రదాయాల గురించి సంక్షిప్తంగా మననం చేసుకుందాం. భారత దేశం లో 2500 సంవత్సరాల క్రితం పుట్టి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించింది. బౌద్ధ మతం ప్రపంచంలోని ముఖ్యమైన మతాలలో ఒకటి.మొత్తం ప్రపంచంలో బౌద్ధ ధర్మాన్ని ఆచరించేవారు 50 కోట్ల పైనే ఉండవచ్చునని అంచనా. బౌద్ధంలో రెండు ప్రధాన విభాగాలున్నాయి.మహాయానం,దేరేవాద అనే విభాగాలు ఉన్నాయి. తూర్పు ఆసియా,టిబెట్ ప్రాంతాలలో మహాయానం అధికంగా ప్రాచుర్యంలో ఉంది. గౌతమ బుద్ధుడు బోధించిన ధర్మ సూత్రాలు బౌద్ధానికి మూలాధారం. త్రిపిటకములు అనే శాస్త్ర గ్రంథం బౌద్ధానికి ప్రధాన ఆధారమని అధికులు విశ్వసిస్తారు.మానవుని సర్వ దుఃఖానికి మూలం కోరికలని వాటిని అదుపులో పెట్టుకొని,జయిస్తే సుఖ శాంతులతో జీవించ వచ్చుని ఆచరించి చూపిన మహనీయుడు బుద్ధుడు.పంచశీల సూత్రాలైన హింసకు పాల్పడవద్దు,ఇతరుల ఆస్తిని ఆశించవద్దు, అవినీతిపరులైన ఆచారాలలో లేదా ఇంద్రియాలకు సంబంధించిన ప్రవర్తనలో మునిగిపోకూడదని, అబద్ధం ఆడవద్దని,మత్తు పదార్థాలు వాడకూడదని బోధించారు.దానితో పాటు అష్టాంగ మార్గాలను ఉపదేశించారు.కాల క్రమంలో కొందరు బౌద్ధాన్ని వ్యతిరేకించి,కనుమరుగుకు కుట్రలు చేశారు.దళిత జాతి వైతాళికుడు,దేశ పాలన కోసం రాజ్యాంగాన్ని రచించి ప్రజలందరికీ మార్గం చూపిన భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మను స్మృతి వర్ణ వ్యవస్థ ద్వారా అంటరాని తనం,కుల వివక్షత,అనేక దుష్కార్యలను చవి చూచిన ఆయన హిందుగా పుట్టాను గాని హిందుగా మరణించనని 1956 అక్టోబర్ 14న మహారాష్ట్రలోని నాగ్‌పూర్ లో లక్షల మంది అనుచరులతో కలిసి బౌద్ధ మతాన్ని స్వీకరించారు. ఈ దేశంలో కనుమరుగైన బౌద్ధాన్ని పాదు కొల్పారు.తెలంగాణ రాష్ట్రంలో ఫణిగిరి,నేల కొండపల్లి లో బౌద్ధారామాలు,స్తూపం వున్నాయి. నాగార్జున సాగర్ నందికొండ వద్ద ప్రపంచ ప్రసిద్ధి గాంచిన బౌద్ధ మ్యూజియం,చారిత్రక విశేషాలు, బౌద్ధ భిక్షువుల సమావేశాలు, బౌద్ధ మతం సిద్ధాంతాలకు అనుగుణంగా తదితర కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ సందర్భంగా విష్ణు మూర్తి మాట్లాడుతూ బౌద్ధ మతం శాంతి,సహనాన్ని, ఇతరులను గౌరవించటం,ముఖ్యంగా మనస్సును అదుపు ఆజ్ఞాల లో వుంచటం నేర్పుతుందని తద్వారా ప్రపంచ శాంతి వర్ధిల్లు తుందన్నారు. మనిషికి ఆత్మ,పరమాత్మ మనస్సని అన్నారు. ప్రపంచానికి బౌద్ధం అనుసరణీయమని తెలిపారు. విష్ణుమూర్తి దంపతులు బౌద్ధ మత ఆచారం ప్రకారం ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహించారు.బుద్ధం శరణం గచ్ఛామి,సంఘం శరణం గచ్ఛామి అంటూ బుద్ధుని, జై బీమ్ నినాదాలతో అంబేద్కర్ ను కీర్తిస్తూ కార్య క్రమాలు నిర్వహించారు.విష్ణుమూర్తి బౌద్ధ భిక్షువు ఆశీస్సులు తీసుకున్నారు.

# కొంపెల్లి'కి నంది పురస్కారం

- త్యాగరాయ గాన సభలో నంది పురస్కారం స్వీకరణ
- తల్లిదండ్రులకు అంకిత మిచ్చిన కవి కొంపెల్లి రామయ్య




**ఖమ్మం రూరల్, నవభూమి, ఫిబ్రవరి 9:** హైదరాబాద్ లోని చిక్కడపల్లిలో గల త్యాగరాయ గాన సభలో అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపు పొందిన తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ సిఈఓ డా.యు వి రత్నం, పోగ్రామ్ డైరెక్టర్ డా.ధనాసి ఉషారాణి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నంది అవార్డు, అబ్దుల్ కలాం లైఫ్ టైం అచ్చివ్ మెంట్ అవార్డుకు ఎంపికైన వారికి ఆదివారం నంది పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా కవి, రచయిత, విశ్లేషకుడు, ఉపాధ్యాయుడు కొంపెల్లి రామయ్యకు సాహిత్యంలో చేసిన కృషికి గాను నిర్వాహకులు నంది అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్బంగా కవి రామయ్య మాట్లాడుతూ ఎంతో అంగరంగ వైభోగంగా, సంగీత విభావరి నిర్వహిస్తూ ఈ అవార్డులు పెద్దలచే ఇప్పించడం ఆనందంగా ఉందన్నారు. తన వంతుగా సామాజిక రుగ్మతలపై సాహిత్య సేద్యం చేస్తున్నానని, మా కుటుంబంలో మొదటి తరం విద్యా వంతుణ్ణి అయిన నేను ఉపాధ్యాయుడిగా నా వంతు పిల్లల అభ్యున్నతికి కృషి చేస్తున్నానని, ఆదిశగా పిల్లలచే బాల సాహిత్యం, మా హెచ్ ఎం కొమ్మవరపు కృష్ణయ్య, తోటి ఉపాధ్యాయుల సహకారంతో రాయిస్తున్నానని వివరించారు. నన్ను ఈ ప్రపంచానికి పరిచయం చేసిన మా అమ్మ నాన్నలకు ఈ ప్రతిష్టాత్మక నంది అవార్డు అంకితమని, నేను సాహితీ రంగంలో ఎదగడానికి కారణమైన సిద్దోజు రామబ్రహ్మం, వికాసవేదిక సంస్థకు, తోటి ఉపాధ్యాయులు, మిత్రులు, కుటుంబ సభ్యులకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్బంగా నంది పురస్కార గ్రహీత కొంపెల్లి రామయ్యను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, మా వికాస వేదిక సంస్థ ప్రముఖులు, మిత్రులు హృదయపూర్వకంగా అభినందనలు తెలియ జేసారు.

# ఇందిర పార్క్ వద్ద మహా ధర్నా జయప్రదం చేయండి

**తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**



**ఏన్కూరు, నవభూమి, ఫిబ్రవరి 9:** కేంద్ర బడ్జెట్ లో వ్యవసాయ రంగం తోపాటు విద్య, ఆరోగ్య సంక్షేమ రంగాలకు నిధులు కేటాయింపులు పెంచాలి అని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్ ఇందిర పార్క్ వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నా జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం ఏన్కూరు ప్రజా సంఘాల కార్యాలయం లో దొంత బోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ రైతాంగ సమస్యలు పరిష్కారం కోసం ఎలాంటి అలోచన చేయలేదు అన్నారు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు గిట్టుబాటు ధరల చట్టబద్ధత, దేశవ్యాప్త రైతు రుణమాఫీ కోసం గత ఐదు సంవత్సరాలుగా రైతులు అనేక రూపాల్లో ఉద్యమం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు, మరో వైపు ఎరువులు సబ్సిడీ,పంట భీమా పథకాల కు కోత పెట్టి కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ప్రోత్సాహకాలు అందించేందుకు బడ్జెట్లో సానుకూల దృక్పథం కనిపిస్తుంది అన్నారు, గ్రామీణ ఉపాధి హామీ పథకం కు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. విద్య ఆరోగ్య రంగాలకు 10 శాతం నిధులు కేటాయింపులు చేయాలన్నారు. కేంద్ర బడ్జెట్ సవరణలు కోరుతూ మహా ధర్నా జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా లక్ష్మా, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇటికాల లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

# 40 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**పాల్వంచ ఫిబ్రవరి 9 నవభూమి ప్రతినిధి:** 1984 – 85 సంవత్సరం లో టెన్త్ క్లాస్ స్థానిక బొల్లోరిగూడెం లోని జెడ్ పిహెచ్ఎస్ లో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకొని అపూర్వ సమ్మేళనం జరుపుకున్నారు. వీరు సుమారు 40 సంవత్సరములు తర్వాత కలుసుకున్నారు. బాపూజీ నగర్ లోని తమ స్నేహితుడు సుంకర రామ కోటేశ్వరరావు ఫామ్ హౌస్ లో కలుసుకున్నారు. వీరిలో ప్రముఖులు కనగాల బాలకృష్ణ, సుంకర రామకోటేశ్వర రావు, కొమరవెల్లి రవీందర్, బూర్గుల దాసు, మంత్రి ఓం ప్రకాష్, సుధారాణి, కిలారు నిర్మల, బండి లక్ష్మణ్, కృష్ణ తదితరులు ఉన్నారు. స్నేహితులు అందరూ కలుసుకొని ఉల్లాస బరితంగా, తమ తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని వారందరూ సరదాగా గడిపారు. ఇటీవలే మృతి చెందిన తమ తెలుగు గురువు అయిన బ్రహ్మాచారి మాస్టర్ ఇంటికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు, వీరందరూ తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఉల్లాసభరితంగా కలుసుకున్నారు.





# సబ్బతి మంగాయమ్మకు ఘన నివాళి అర్పించిన ప్రముఖులు

- పాల్గొన్న కూనంనేని,రాములు నాయక్‌తో పాటు అన్ని పార్టీల నాయకులు
- ఏసిపి విష్ణుమూర్తి కుటుంబ సభ్యులకు సంఘీభావం

**జూలురుపాడు,ఫిబ్రవరి 09 (నవభూమి ప్రతినిధి)-** మండల కేంద్రానికి చెందిన పోలీస్ ఉన్నతాధికారి సబ్బతి విష్ణుమూర్తి తల్లి మంగాయమ్మ ఇటీవల మరణించారు.వారి దశ దిన కార్య క్రమాలు ఆది వారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం నియోజక వర్గ శాసన సభ్యులు, సి పి ఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, వైరా నియోజక వర్గ మాజీ శాసన సభ్యులు లావుడియ రాములు నాయక్ పాల్గొని మంగాయమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.వారితో పాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు కాంగ్రెస్ పార్టీ నాయకులు దుద్దుకూరు మధు, వేల్పుల నరసింహారావు, పొన్నెకంటి సతీష్,బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు,ఎల్లంకి సత్య నారాయణ,తెలుగు దేశం పార్టీ నాయకులు ఆరెం రామయ్య,మాస్ లైన్ ఎం ఎల్ పార్టీ నాయకులు గోపాల రావు,ధర్మా, సింగరేణి సంస్థ జీ ఎం గోనె శ్రీకాంత్,విశ్రాంత పోలీస్ అధికారి చనుమోలు సుబ్బారావు, దెబ్బెందుల నాగయ్య, అడ్వకేట్ బండ్ల రాజ శేఖర్,కోటంరాజు, రజాక్, పరంజ్యోతి, మద్దెల శివకుమార్, ఎల్లంకి చిన నాగేశ్వరరావు, ప్రభాకర్, పుల్లయ్య, సత్యం, పలువురు పాత్రికేయులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని నివాళులు అర్పించారు









# వెంకటేశ్వర స్వామి ఆలయానికి భాస్కర విద్యార్థుల పాదయాత్ర





**ఏర్రుపాలెం, నవభూమి, ఫిబ్రవరి 9 :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాచ్చిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని మండల పరిధిలోని మీనవోలు శ్రీ భాస్కర పాఠశాల పదో తరగతి విద్యార్థులు కరస్పాండెంట్ బి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్రగా వచ్చి దర్శించుకున్నారు.ఉదయం నాలుగు గంటలకు మీనవోలు భాస్కర స్కూల్ నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు 55 మంది ఉపాధ్యాయులతో కలిసి కాలినడకన 14 కిలోమీటర్లు నడిచి స్వామివారి ఆలయాన్ని దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు విద్యార్థులను ఆశీర్వదించి తీర్థ, ప్రసాదాలను అందించారు.ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ పాఠశాల పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల ముందు 2002 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వెళ్లి స్వామి వారి ఆశీర్వాదం తీసుకొని పరీక్షలకు సిద్ధం అవుతున్నారని తెలిపారు.త్వరలో జరగబోయే10వ తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ఈరోజు స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు.స్వామి వారి మీద ఉన్న భక్తితో ప్రతి సంవత్సరం తమ పాఠశాల విద్యార్థులను జమలాపురం పాదయాత్రగా తీసుకుని వస్తున్నామని స్వామివారి అనుగ్రహంతో విద్యార్థులు ప్రతి సంవత్సర ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు.ఈ ఉపాధ్యాయులు సంధ్య,పివిఆర్,జానకి రామిరెడ్డి,వాసు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు

# భీమారంలో తాగునీటి సరఫరాపై స్పెషల్ డ్రైవ్

**మంచిర్యాల జిల్లా భీమారం ప్రతినిధి ఫిబ్రవరి 09 (నవభూమి):** భీమారం మండల కేంద్రంలో త్రాగు నీటి సరఫరా పై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మిషన్ భగీరథ ఏఈ రాజమౌళి సందర్శించారు. త్రాగు నీటి సరఫరాను మరియు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను పరిశీలించడం జరిగింది. త్రాగునీరు సరఫరా చేసే పైపు లైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని, అన్ని గృహాలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందా, ఓహెచ్ఎస్ఆర్ లు అన్ని మిషన్ భగీరథ వాటర్ లైన్ కు అనుసంధానించి ఉన్నాయా అని చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు మిషన్ భగీరథ



సిబ్బంది పాల్గొన్నారు

# ఆరు గ్యారంటీల అమలుకై 20న చలో హైదరాబాద్





**గుండాల ఫిబ్రవరి 9 నవభూమి:** కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే వందరోజులల్లో అమలు చేస్తామని ప్రకటించింది, కానీ అధికారంలోకి వచ్చి14 మాసాలైనా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గుండాల మండల కార్యదర్శి అరెం నరేష్, జిల్లా నాయకులు కొమరం సీతారాములు అన్నారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిగూడెం, చీమలగూడెం, కన్నా యిగూడెం, నరసాపురం తండా తదితర గ్రామాలలో జరిగిన గ్రూప్ మీటింగ్లలో వీరు మాట్లాడుతూ రైతు భరోసా 15000 ఎకరాకు, మహిళలకుమహాలక్ష్మి పథకం కు 2500, వృద్ధాప్య పింఛన్ 4000, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు లాంటి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఈ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ హామీల అమలు కొరకు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమంకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై నిరసన తెలిపి అధికార కాంగ్రెస్ పార్టీకి కళ్ళు తెరిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు పెండేకట్ల పెంటన్న, వాగబోయిన బుచ్చయ్య, పాయం ఎల్లన్న, కల్తీ ప్రమోద్, బోడ వీరు, బోడ రాము, దుగ్గి శేఖర్, చింత కోటేష్, కిసాన్ సుధాకర్, మోకాళ్ళ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# యువత అంత మోడీ వైపే

## విజయం అందించండి..సమస్యలు పరిష్కరిస్తా

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

**మెదక్ ప్రతినిధి నవభూమి:** దేశంలో మోడీ ప్రభుత్వం హవా నడుస్తుందని అదే దిశగామెదక్ ,నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో బీజేపీ జెండా ఎగురవేసే విదంగా బీజేపీ అభ్యర్థిగా బరిలో నాకు యువత తనకు సహకరించి విజయం చేకూర్చేలా కృషి చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డి కోరారు. ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డి జిల్లా బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు దేశంలో మోడీ హవా కొనసాగుతుందని నిన్ననే 27 సంవత్సరాల తర్వాత హస్తిన ను బీజేపీ ప్రభుత్వం విజయ డాంఖ మోగించి హస్తగతం చేసుకుందని పేర్కొన్నారు. అలాగే ఇప్పటికే 43లక్షల సభ్యత్వాలు నమోదు అయ్యాయని కావున బీజేపీ మండల, బూత్ నాయకులు బీజేపీ విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్, మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ఎన్నికల ఇంచార్జి విష్ణువర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ప్రసాద్ తదితరులు ఉన్నారు



# స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఐ కార్యకర్తల సిద్ధం కావాలి

- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుల ముత్యాల విశ్వనాథం
- పోడు సాగుదారులకు పోడు పట్టాలు అందించాలి
- ఏజెన్సీ గ్రామాలను అభివృద్ధి చేయడమే స్థానిక ఎమ్మెల్యే కూనంనేని లక్ష్యం
- ఉలవనూరు-చంద్రాల గూడెంలో సిపిఐ గ్రామ శాఖ మహాసభలు





**పాల్వంచ ఫిబ్రవరి 9 నవభూమి ప్రతినిధి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో సిపిఐ కి ప్రాతినిధ్యం వచ్చే విధంగా ప్రణాళికలు రచించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుల ముత్యాల విశ్వనాథం పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధి లోని ఉలవనూరు ఎస్సీ కాలనీలో నిట్టా అమృత రావు, చంద్రాలగూడెం లో వజ్జా ఆది నారాయణ అధ్యక్షతన సీపీఐ గ్రామ శాఖ మహాసభలు నిర్వహించారు. ఈ సభలకు ముఖ్య అతిధి గా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుల ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ అనాదిగా పోడు సాగు చేసుకుంటున్న పొడు సాగుదారులందరికీ పట్టాలు అందించి, రైతు భరోసా అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గ పరిధిలోని ఏజెన్సీ గ్రామాలను మరింత అభివృద్ధి చేయడానికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని తెలిపారు. సభ అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీని 15 మందితో ఎన్నుకున్నారు. ఉలవనూరు ఎస్సీ కాలనీ గ్రామశాఖ కార్యదర్శిగా నిట్టా అమృత రావు, సహాయ కార్యదర్శిగా బేతం మురళి, చంద్రాల గూడెం గ్రామ శాఖ కార్యదర్శిగా కొర్సా పట్టాభి, సహాయ కార్యదర్శిగా ఈసం చిన్న శేషయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో పాల్వంచ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, మండల నాయకులు నిమ్మల రాంబాబు, కొంగర అప్పారావు వేములపల్లి శ్రీనివాసరావు, దారా శ్రీనివాసరావు, కుంజ రాందాస్, వజ్జా నారాయణ, ఈసం గోపయ్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆయుర్వేదిక్ డాక్టర్ బత్తిని భార్గవికి పట్టా పురస్కారం

- పట్టు వదలని విక్రమార్కురాలిగా బిఏఎంఎస్ వైద్యురాలిగా భార్గవి
- కృషి ఆశయం ఉంటే సాధించనిది లేదని నిరూపించిన ఆయుర్వేదిక్ డాక్టర్ భార్గవి






**గుండాల ఫిబ్రవరి 9 నవభూమి:** నేటి సమాజంలో యువతీ, యువకులు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఆశయం పట్టుదల కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించి, కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు, మహా పురుషులవుతారు అనే నినాదంతో మట్టిలో మాణిక్యంలా, తల్లిదండ్రులకు గొప్ప పేరు ప్రఖ్యాతలను తెచ్చిపెట్టిన బిఏఎంఎస్ ఆయుర్వేదిక్ డాక్టర్ బత్తిని భార్గవి అనంతపురం జిల్లా గుంతకల్ సాస ఆయుర్వేదిక్ కాలేజీలో విద్యను పూర్తిచేసిన క్రమంలో, ఆమె కృషి ఫలితంగా ఆదివారం అరుదైన ఆయుర్వేదిక్ డాక్టర్ పట్టా పురస్కారం లభించడంతో తల్లిదండ్రులు బత్తిని శోభ గౌడ్, తండ్రి సారంగపాణి గౌడ్ ఆనందోత్సవంలో మునిగిపోయారు. కన్న కూతురు బత్తిని భార్గవి నర్సంపేట సిద్ధార్థ పాఠశాల్లో మెట్రిక్ లేషన్ చదివి, త్రివేణి కాలేజీలో ఇంటర్ పూర్తి చేసిన అనంతరం మెడికల్ నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురం గుంతకల్ మెడికల్ ఆయుర్వేదిక్ కాలేజీల్లో ఐదున్నర సంవత్సరాలుగా కఠోరంగా విద్యను పూర్తిచేసి అందరికీ ఆదర్శంగా నిలవడం విశేషం. బత్తిని శోభ, సారంగపాణి గౌడ్ దంపతుల గారాల ముద్దుల పట్టి బత్తిని భార్గవికి ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురం జిల్లాలోని గుంతకల్ మెడికల్ ఆయుర్వేదిక్ కాలేజీలో బీఏఎంఎస్ డాక్టర్ పట్టా పురస్కారం కాలేజీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా విలువైన అనంతమైన ఆయుర్వేదిక్ డాక్టర్ పట్టాను అందుకోవడం శుభ సంతోషకరమని బత్తిని సారంగపాణి తెలిపారు. తల్లిదండ్రులు శోభ సారంగిపాణి గౌడ్ మాట్లాడుతూ.. కూతురు బత్తిని భార్గవి బాల్యదశ నుండే విద్య పట్ల ఎంతో మక్కువ ఉండేదని, పట్టు వదలని కృషి, ఆశయం ఆమె ముందు పటాపంచలు చేసి, ఐదున్నర ఏండ్లు కఠినమైన విద్యను పూర్తిచేసి ఆయుర్వేదిక్ బిఏఎంఎస్ డాక్టర్ పట్టా పురస్కారం దక్కడం మాకు ఎంతో గర్వంగా ఉందన్నారు. కన్న బిడ్డలు కళ్ళ ముందు తల్లిదండ్రుల ఆశయాలను నిలబెట్టి ఉన్నత స్థానాలను అధిరోహించడంతో తల్లిదండ్రులకు అవధులు లేని ఆనందం కలుగుతుందని, ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలవడం బత్తిని భార్గవికి పట్టా పురస్కారం లభించడంతో గుండాల మండలానికే గర్వంగా ఉందని ఆకాంక్షించారు. ఆయుర్వేదిక్ డాక్టర్ బత్తిని భార్గవి గౌడ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు శోభ బత్తిని సారంగిపాణి గౌడ్, నా భర్త దూలం సతీష్ గౌడ్, అన్నయ్య హరికృష్ణ గౌడ్, చెల్లెలు వర్షా గౌడ్ల ప్రోత్సాహంతో, విలువైన విద్య ఎంతో ముందుకు సాగిందని , వారి కృషి ఫలితంగా పట్టుదలతో బిఏఎంఎస్ విద్యను విక్రమార్కురాలిగా కోర్సు పూర్తిచేసి, గుండాల మండలానికి, మా కుటుంబ సభ్యులకు పేరు ప్రఖ్యాత లభించేలా ఎంతో శ్రమించడం జరిగిందని,అన్నారు మట్టిలో మాణిక్యంలా ఆదివాసి ఏజెన్సీ గిరిజన గుండాల మండలంలోని తండ్రి విలేకరిగాను విధులు నిర్వహిస్తూ, పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపుతూ, ప్రోత్సాహం చేయడంతోనే నేడు ఎవరెస్టు శిఖరాలను అందిపుచ్చుకోవడం జరిగిందని తెలిపారు. ఏదిఏమైనాప్పటికీ ఆయుర్వేదిక్ డాక్టర్ బత్తిని భార్గవికి ముందున్న వైద్య సేవలు ప్రజలకు ఎనలేనివిగా అందించేందుకు తమకు లభించిన పట్టా పురస్కారమే నిలువెత్తు నిదర్శనమని మండలంలోని అధికారులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పలువురు ప్రశంసించడం గర్వకారణం.